సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

గురువారం । 30 । మార్చి । 2023

కేయూ పరిపాలనా భవనం వద్ద విద్యార్థులపై లాఠీచార్జ్ చేస్తున్న పోలీసులు, కార్యాలయం ఎదుట బైఠాయించిన విద్యార్థులు







పగిలిన పరిపాలనా భవనం అద్దం

పగిలిన అద్దాలు.. విరిగిన లాఠీ

కేయూలో విద్యార్థుల ఆందోళన.. ఉద్రిక్తత

టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీపై చైర్మన్, సభ్యులను భర్తరఫ్ చేయాలని, విద్యార్థి ఉద్యమకారుల సంఘర్షణ సభ అనుమతి రద్దు చేయడాన్ని నిరసిస్తూ కాకతీయ యూనివర్సిటీలో బుధవారం విద్యార్థి జేఏసీ చేపట్టిన ఆందోళన రణరంగంగా మారింది. పరిపాలనా భవనం ముట్టడించిన విద్యార్థులను పోలీసులు అడ్డుకుని లాఠీలు ఝుళిపించారు. ఈ క్రమంలో విద్యార్థులు ఆగ్రహంతో భవనం అద్దాలు, పూలకుండీలను ధ్వంసం చేశారు. పలువురు విద్యార్థి నేతలను అరెస్ట్ చేసి ధర్మసాగర్ పీఎస్‌కు తరలించారు. వీసీ ఫిర్యాదు మేరకు పోలీసులు మొత్తం 13మంది విద్యార్థులపై కేసు నమోదు చేశారు. -కేయూ క్యాంపస్

- 10లో ▸

ఇఫ్తార్ | సహర్
గురు 6:35 | శుక్ర 4:49

రంజాన్ వేళలు



భద్రకాళి మాతకు లిల్లీ పుష్పార్చన

హన్మకొండ కల్చరల్ : వరంగల్ భద్రకాళి దేవాలయంలో వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు బుధవారం లిల్లీ పూలతో మాతకు పుష్పార్చన నిర్వహించారు. ఉదయం నుంచి వేద పండితులు, అర్చకులు అమ్మవారికి నిత్యాహ్నికం జరిపారు. లిల్లీ పూలకు సంప్రోక్షణ చేసి లక్ష పుష్పార్చన నిర్వహించారు.

న్యూస్‌రీల్

31న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

కేయూ క్యాంపస్: కాకతీయ విశ్వవిద్యాలయం భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'మెట్‌ల్యాబ్స్ అండ్ ఇట్స్ అప్లికేషన్' అనే అంశంపై ఈ నెల 31న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు విభాగాధిపతి సీజే శ్రీలత, పాఠ్య ప్రణాళిక అధ్యక్షురాలు డాక్టర్ జి.పద్మజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 31 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. కేయూలోని ఫిజిక్స్ విభాగ సెమినార్ హాల్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వీసీ తాటికొండ రమేష్, సైన్స్ విభాగాల డీన్ పి.మల్లారెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు.

కీర్తి పురస్కారం అందుకున్న రామేశ్వరం



కేయూ క్యాంపస్: కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం రిటైర్డ్ ఆచార్యులు, హనుమకొండలోని ప్రకాశ్‌రెడ్డిపేటలో అంతర్జాతీయ ప్రకృతి వైద్య సాహిత్య గ్రంథాలయం వ్యవస్థాపకులు గజ్జల రామేశ్వరం బుధవారం హైదరాబాద్‌లోని పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయంలో కీర్తి పురస్కారం అందుకున్నారు. ప్రకృతివైద్యంపై విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్న రామేశ్వరాన్ని ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ వీసీ తంగెడ కిషన్‌రావు, రిజిస్ట్రార్ రమేష్, తెలంగాణ గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీధర్‌ల చేతులమీదుగా ఆయన ఈ పురస్కారం అందుకున్నారు.

సీకేఎం మట్టిలోనే త్యాగం ఉంది : వీసీ రమేష్



వరంగల్: చందా కాంతయ్య స్మారక కళాశాల (సీకేఎం) మట్టిలోనే త్యాగం ఉందని కేయూ వీసీ తాటికొండ రమేష్, ప్రముఖ పాటల రచయిత మిట్టపల్లి సురేందర్‌లు అన్నారు. దేశాయిపేటలోని సీకేఎం కళాశాలలో బుధవారం జరిగిన 'చైతన్య ఉత్సవం'(కాలేజ్ డే) కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు ఈ మట్టినుంచి జయశంకర్ సార్... వరవరరావు లాంటి వ్యక్తులు వచ్చారన్నారు. చందా విజయ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సుధాకర్‌రెడ్డిలు సందేశం అందజేశారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు చందా శ్రీకాంత్, ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ డాక్టర్ పి.సతీష్‌కుమార్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, లైబ్రేరియన్ అనిల్‌కుమార్, కల్చరల్ కోఆర్డినేటర్ అరుణ, అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ క్యాంప్‌నకు రిజిస్ట్రేషన్ కార్యాలయం!

భవనాల పరిశీలన..

హసన్‌పర్తి: కేయూసీ–కాజీపేట రోడ్డులోని వడ్డెపల్లి చెరువు సమీపంలో ఉన్న జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని చింతగట్టు ఎస్సారెస్పీ క్యాంపునకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు క్యాంప్‌లో నిరుపయోగంగా ఉన్న భవనాలను ఆ శాఖ ఉద్యోగులు బుధవారం పరిశీలించారు. గతంలోఎస్సారెస్పీ–2 కార్యాలయాలు నిర్వహించిన రెండు భవనాలతోపాటు డివిజన్–4 భవనం ఉంది. ఇందులో ఓ భవనంలో పరకాల సబ్ డివిజన్‌కు సంబంధించిన కార్యాలయాన్ని తాత్కాలికంగా నిర్వహిస్తున్నారు. అదేవిధంగా హసన్‌పర్తిలోని సంస్కృతి విహార్‌లో కూడా ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. పదేళ్ల క్రితం ఓ భవనాన్ని నిర్మించినప్పటికీ ఇప్పటివరకు ప్రారంభించలేదు. దీనిని కూడా పరిశీలించనున్నట్లు తెలిసింది. ఏ భవనం అనుకూలమో గుర్తించాక కార్యాలయ తరలించేందుకు అనుమతి కోసం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు రిజిస్ట్రేషన్‌శాఖ ఉద్యోగులు తెలిపారు.

ఆక్రమణల వెల్లువ!

- క్షేత్రస్థాయిలో గుర్తించిన టాస్క్‌ఫోర్స్ అధికారులు
- ఏనుమాములలో పోలీసులకు బాధితుల ఏకరువు
- ప్రతాపరుద్ర కాలనీలో రోడ్డు అక్రమణపై ఫిర్యాదు



ఏనుమాముల 14వ డివిజన్‌లో ఆక్రమణలను పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు



30ఫీట్ల రహదారికి అడ్డంగా నిర్మించిన ప్రహరీ(సర్కిల్‌లో)

వరంగల్: ఏనుమాముల ప్రాంతంలో భూకబ్జా గ్యాంగులు పాల్పడుతున్న ఆక్రమణలు చీమల పుట్టల్లా తయారైన విషయాన్ని టాస్క్‌ఫోర్స్ బృందం గుర్తించింది. ఈ మేరకు బుధవారం క్షేత్రస్థాయిలో ప్లాట్లను పరిశీలించి రూఢీ చేసుకున్నట్లు సమాచారం. 14వ డివిజన్ కార్పొరేటర్ భర్త, మాజీ జెడ్పీటీసీ తూర్పాటి సారయ్య, మాజీ కారోబార్ రఘు, శ్రీనివాస్, జంగం రాజు, గండ్రతి భాస్కర్‌లను భూఆక్రమణ ఫిర్యాదులపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకుని విచారించి రాత్రి వదిలేసిన విషయం తెలిసిందే. విచారణలో తాము ప్లాట్లను కొనుగోలు చేశామని, ఆక్రమించుకోలేదని చెప్పడంతో క్షేత్రస్థాయిలో పర్యటించి అసలు విషయాలను తెలుసుకోవాలని సీపీ ఆదేశించినట్లు తెలిసింది. దీంతో డీసీపీ కరుణాకర్, మామునూరు ఏసీపీ కృపాకర్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి, సీఐలు శ్రీనివాసరావు, మహేందర్‌రెడ్డిలు క్షేత్రస్థాయిలో పర్యటించడంతో పదుల సంఖ్యల్లో బాధితులు వారిని కలిసి ఫిర్యాదులు చేశారు. ఆక్రమణల ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు అధికార పార్టీకి చెందిన వారు కావడంతో ఇరువర్గాలను కాంప్రమైజ్ చేసి కేసును నీరుగార్చేందుకు రాష్ట్రస్థాయి నేతలతో పోలీసులపై ఒత్తిళ్లు తీసుకువస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కబ్జారాయుళ్లకు గుణపాఠం చెప్పకుంటే ఏనుమాముల ప్రాంతంలో భూకబ్జాల దందా ఇంకా పెట్రేగిపోతుందన్న భయాన్ని బాధితులు వ్యక్తం చేస్తున్నారు.

ఫిర్యాదుల స్వీకరణ...

తమ ప్లాట్లను ఆక్రమించుకున్నారని పలువురు బాధితులు టాస్క్‌ఫోర్స్ ముందు ఏకరువు పెట్టారు. వారిని స్టేషన్ వచ్చి ఫిర్యాదులు అందించాలని పోలీసులు సూచించారు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో బాధితులనుంచి ఫిర్యాదులు స్వీకరించిన అధికారులు సాయంత్రం బాధితులు, ఆరోపణలు ఎదుర్కొంటున్నవారు టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి రావాలని, అక్కడే నిగ్గు తేలుస్తామని చెప్పినట్లు సమాచారం. అక్కడ సీపీ నేతృత్వంలో విచారణ జరుగుతుందని చెప్పారు. కాగా, ఇప్పటికి ఎన్నో సార్లు ఫిర్యాదు చేసి స్టేషన్ల చుట్టూ తిరిగి వేసారిన బాధితులు సీపీ రంగనాథ్ ఎదుట తమ గోడు వెళ్లబోసుకున్నట్లు సమాచారం.

అందరొక్కటై అమ్ముకున్నారు..

డివిజన్‌లోని సర్వేనంబర్ 259లోని ప్రతాపరుద్ర కాలనీ 3వ లైన్‌లో 100ఫీట్ల రోడ్డుకు అనుసంధానంగా ఉన్న 30ఫీట్ల రోడ్డును మూడేళ్ల క్రితం చిలుక భాస్కర్, బాలాజీ కుమారస్వామి, జానీ అనే వ్యక్తులు ఆక్రమించుకున్నారు. దీనిపై పోలీసులకు, గ్రేటర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో 2020 సెప్టెంబర్ 30న రెవెన్యూ టీం వచ్చి జేసీబీతో కూల్చివేశారని స్థానికులు తెలిపారు. కార్పొరేషన్ ఎన్నికల తర్వాత యథావిధిగా గోడ నిర్మించి షెడ్‌గా మార్చారని, ఈవిషయంపై ఆక్రమించుకున్న వారిని కాలనీ వాసులం ప్రశ్నిస్తే 'మీ దిక్కున్న కాడా చెప్పుకోండి'అంటూ ఎగతాళి చేస్తున్నారని అవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు అప్పటి కూల్చివేతకు సంబంధించిన వీడియోతో పాటు 22మంది సంతకాలతో కూడి వినతిపత్రాన్ని పోలీస్ అధికారులకు అందజేశారు. ప్లాన్‌లో ఉన్న రహదారికి అడ్డంగా ఉన్న నిర్మాణాలను తొలగించి కాలనీ నుంచి 100ఫీట్ల రోడ్డుకు వెళ్లేందుకు దారి కల్పించారని విజ్ఞప్తి చేశారు. స్పందించిన డీసీపీ వెంటనే అక్రమణలకు పాల్పడిన ముగ్గురిపై కేసులు నమోదు చేయడంతోపాటు వారిని కార్యాలయంలో గురువారం హాజరు పర్చాలని ఏనుమాముల ఇన్‌స్పెక్టర్ మహేందర్‌ను ఆదేశించినట్లు కాలనీవాసులు తెలిపారు.

సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి



కల్యాణోత్సవానికి వరంగల్ శివనగర్‌లోని సీతారామచంద్రస్వామి ఆలయ ఆవరణలో వేసిన షామియానాలు

హన్మకొండ కల్చరల్ : నగరంలోని వివిధ ఆలయాల్లో గురువారం జరగనున్న శ్రీసీతారామచంద్రస్వామిల కల్యాణ మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. పలు దేవాలయాల్లో కల్యాణం నిర్వహించడానికి షామీయానాలు, పందిళ్లు వేసి మామిడి తోరణాలు, విద్యుత్‌దీపాలతో ముస్తాబు చేశారు. వేయిస్తంభాల గుడిలో ఉదయం 10గంటల నుంచి కల్యాణతంతు ప్రారంభమవుతుందని ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ, ఈఓ వెంకటయ్య తెలిపారు. వరంగల్ ఎల్లంబజార్‌లోని శ్రీసీతారామచంద్రస్వామి వారి అలయం, శివనగర్‌లోని సీతారామచంద్రస్వామి ఆలయం, ఓ సిటీలోని శ్రీసీతారామాంజనేయ లక్ష్మీగణపతి అయ్యప్పస్వామి దేవాలయం, హనుమకొండలోని చిన్నకొవెల, రెవెన్యూ కాలనీ, ఎక్సైజ్ కాలనీ, తదితర కాలనీల్లోని ఆలయాల్లో కల్యాణోత్సవాలు జరగనున్నాయి.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్



కంటి పరీక్షలు చేయించుకుంటున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, ఉచిత కంటి పరీక్షలు చేయించుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. బుధవారం టీఎన్జీవోస్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్‌లోని ఆ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కంటి పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులతో సహా కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ మాట్లాడుతూ అంధత్వ రహిత తెలంగాణ లక్ష్యంగా సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ సాంబశివరావు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజశేఖర్, టీఎన్జీవోస్ యూనియన్ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, నాయకులు పుల్లూరు వేణుగోపాల్, పనికల రాజేష్, శనిగరపు శ్యాం సుందర్, కత్తి రమేష్, రాము నాయక్, సారంగపాణి, పెన్షనర్ల సంఘం బాధ్యులు సర్వర్ హుసేన్, గోవర్ధన్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య విధానాలు భేష్

- నగరంలో బంగ్లాదేశ్, నేపాల్ మేయర్ల బృందం పర్యటన



వడ్డేపల్లి పబ్లిక్ టాయిలెట్‌ను పరిశీలిస్తున్న బంగ్లాదేశ్, నేపాల్ మేయర్లు, ప్రతినిధుల బృందం

వరంగల్ అర్బన్: వరంగల్ మహా నగర పరిధిలో అవలంబిస్తున్న వివిధ అధునాతన శానిటేషన్ విధానాలు అత్యుత్తమంగా ఉన్నాయని బంగ్లాదేశ్, నేపాల్ మేయర్ల బృందం కితాబిచ్చింది. జీడబ్ల్యూఎంసీ చేపడుతున్న శానిటేషన్ పద్ధతులను బుధవారం వివిధ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో ఆయా దేశాల మేయర్లు, ప్రతినిధుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా బృందం సభ్యులు వడ్డేపల్లిలో గల పబ్లిక్ టాయిలెట్స్‌ని పరిశీలించి నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్య నిర్వహణపై ఆస్కీ ప్రతినిధి రాజమోహన్ వారికి వివరించారు. అమ్మవారిపేటలోని మలం, వ్యర్థాల శుద్ధి కర్మాగారం (ఎఫ్ఎస్‌టీపీ), హనుమకొండ అంబేద్కర్ నగర్‌లోని డీ సెంట్రలైజ్డ్ సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్, వరంగల్ పరిధి ఎంహెచ్ నగర్‌లోని స్లమ్ ప్రాంతాన్ని సందర్శించారు. పలు కాలనీల ప్రజల జీవన స్థితిగతులు, ప్రభుత్వం ద్వారా అందుతున్న సేవలపై ఆరా తీశారు. నగర పర్యటనలో ఆయా దేశాల మేయర్లు ఎండీ ఖలీద్ హోస్సేన్, జకియా ఖతూన్, ఎండీ ముషారఫ్ హోస్సేన్, ఖాజీ మహమ్మదుల్ హస్సన్, హాజీ ఎండీ అబ్దుల్ ఘని, అంజుమ్ అర బేగం, నిర్మలేందు చౌదరి, మోహియుద్దీన్ అహ్మద్, రఫీక అక్తర్ జహన్, పర్వేజ్ రెహమాన్, రజావుల్ కరీం, సయ్యద్ మునిరుల్ ఇస్లాం, ఎండీ ఖయ్యూం సహ రియల్ జహిదితోపాటు ట్రెనింగ్ స్పెషలిస్ట్ మహమ్మద్ ఇంతియాజ్ షరీఫ్, అబ్దుల్ అమీన్ మున్షి, పరిమల్ కుమార్ దేవ్, కార్పొరేటర్ సురేష్ జోషి, ఆస్కీ సిబ్బంది పాల్గొన్నారు.

మహానగర పరిశుభ్రతపై ప్రతిజ్ఞ



పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేస్తున్న పొదుపు సంఘాల మహిళలు, పారిశుద్ధ్య సిబ్బంది

వరంగల్ అర్బన్: జీరో వేస్ట్ అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం నగరంలోభారీ ర్యాలీ నిర్వహించారు. బల్దియా ప్రధాన కార్యాలయం వద్ద ర్యాలీని డిప్యూటీ కమిషనర్ అనిసుర్ ఉర్ రషీద్ జెండా ఊపి ప్రారంభించారు. ఎంజీఎం జంక్షన్ మీదుగా కేఎంసీ వరకు నిర్వహించారు. సర్కిల్‌లో పొదుపు సంఘాల మహిళలు, బల్దియా పారిశుద్ధ్య సిబ్బంది మానవహారం నిర్వహించి పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రషీద్, ఎంహెచ్ఓ రాజేష్, సీహెచ్ఓ శ్రీనివాస రావు, సెక్రటరీ విజయలక్ష్మి, శానిటరీ సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

'ఎమర్జెన్సీ' ట్రైనింగ్!

- అత్యవసర సమయాల్లో ప్రాణాలు కాపాడే వైద్యసేవలపై శిక్షణ
- ఇప్పటికే ఉస్మానియా మెడికల్ కాలేజీలో నెల్స్ ట్రైనింగ్
- కేఎంసీలోనూ రీజినల్ సెంటర్‌కు శ్రీకారం
- మరో నెలరోజుల్లో వైద్యులు, నర్సులకు మరూ కానున్న శిక్షణ
- తొలుత మాన్‌క్వీన్, ఆ తర్వాత సిమ్యేటర్స్‌తో ట్రైనింగ్

మూడు దశల్లో సేవలు



అత్యవసర వైద్యసేవల విషయాల్లో రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు వైద్యులు, నర్సులు, పారా మెడికల్ విద్యార్థుల్లో మేథాశక్తిని పెంపొందించేందుకు ఉద్దేశించిందే నేషనల్ ఎమర్జెన్సీ లైఫ్ సపోర్ట్(ఎన్ఈఎల్ఎస్) కోర్సు. కేఎంసీలో రీజినల్ సెంటర్‌కు ఇప్పటికే రూ1.50కోట్ల విలువచేసే మాన్‌క్వీన్స్ వచ్చాయి. రూ.10కోట్ల విలువచేసే సిమ్యేటర్స్ కూడా రానున్నాయి. ఈ కోర్సులో తొలుత మాన్‌క్వీన్స్(బొమ్మలు) ఉపయోగించి అత్యవసర సమయాల్లో ఎలా వ్యవహరించాలో ప్రాక్టికల్‌గా శిక్షణ ఇస్తారు. ఆ తర్వాత సిమ్యేటర్స్ ద్వారా అంటే.. రోగులకు సర్జరీ చేసినట్టుగానే హ్యాండ్స్ మూవ్ చేయడం వల్ల దేని తర్వాత ఎలా చేయాలన్న స్టెప్పులను అనుకరించాల్సి ఉంటుంది. దీనికి స్కోరింగ్ కూడా వస్తుంది. పర్ఫెక్ట్ చేసేంత వరకు ట్రైనింగ్ ఇస్తారు. ఆ తర్వాత ఆస్పత్రుల్లో నిజంగానే అత్యవసర విభాగంలో రోగులకు ఈ సేవలు అందిస్తారు. సర్జరీలు కూడా చేస్తారు. ఇలా ప్రాక్టికల్ ట్రైనింగ్ ద్వారా ఎమర్జెన్సీ సమయంలో తడబాటు లేకుండా వైద్య సేవలు అందించడం వల్ల ప్రాణాలు నిలిపే అవకా ఎక్కువగా ఉంటుంది.

- డాక్టర్ మోహన్‌దాస్, కేఎంసీ ప్రిన్సిపాల్

సాక్షి, వరంగల్: ప్రజలకు నాణ్యమైన.. అత్యవసర వైద్య సేవలు అందించడంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఒక్కసారిగా అస్వస్థతకు గురైన వారికి అత్యవసరంగా అందించే చికిత్సలో మెళకువలు ప్రాక్టికల్‌గా నేర్పేందుకు కాకతీయ మెడికల్ కాలేజీలో త్వరలోనే నేషనల్ ఎమర్జెన్సీ లైఫ్ సపోర్ట్(ఎన్ఈఎల్ఎస్) ట్రెనింగ్ రీజనల్ సెంటర్ అందుబాటులోకి రానుంది. ఇందుకు సంబంధించి ఇప్పటికే రూ.17కోట్ల వ్యయంతో చేపట్టిన నిర్మాణ పనులు పూర్తి కావొచ్చాయి. వచ్చే నెలలో షురూ కానున్న శిక్షణలో వందలాది మంది వైద్యులు, నర్సులు, అంబులెన్స్ సిబ్బందితోపాటు పారా మెడికల్ సిబ్బందికి కూడా ఎమర్జెన్సీ సేవల్లో అనుసరించాల్సిన తీరుపై ప్రధానంగా తర్ఫీదు ఇవ్వనున్నారు. విదేశాల్లో మాదిరిగానే దేశంలో కూడా నాణ్యమైన వైద్యం అందాలన్న ఉద్దేశంతో కేంద్రం తీసుకొచ్చిన ఎన్ఈఎల్ఎస్ కోర్సు ద్వారా అత్యవసర సమయాల్లో వేలాది మంది రోగులను బతికించే అవకాశం ఉంది. ఎందుకంటే.. రోగి ఆరోగ్యం ప్రమాదకర స్థితిలో ఉన్నప్పుడు అందించే వైద్య సేవల్లో సిబ్బంది చేసే చిన్నచిన్న పొరపాట్లు, ఆ సమయంలో ఏమి చేయాలో తోచకపోవడం, ఎక్విప్‌మెంట్ల వాడకంపై సరైన అవగాహన లేకపోవడం వల్ల ఎమర్జెన్సీ రోగులు బతకడం వేళ్లమీద లెక్కపెట్టొచ్చు. అందుకే.. ఆయా సమయాల్లో ఏమాత్రం తత్తరపాటుకు తావివ్వకుండా వైద్య సేవలు ఎలా అందించాలనే అంశంపై ఒకదాని తర్వాత ఒకటి ప్రాక్టికల్‌గా చేయించనున్నారు. ఇప్పటికే హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రిలోని నెల్స్ కోర్సులో కేఎంసీ కాలేజీ నుంచి నలుగురు ప్రొఫెసర్లు డాక్టర్ విజయ్‌కుమార్(పిడియాట్రిషన్), మురళి(అనస్తీషియా), నిరంజనాదేవి(గైనకాలజీ), వెంకట్(మెడికల్) ఇటీవల శిక్షణ పొందారు.

ఎలా ఉంటుందంటే...

ముఖ్యంగా మెడికల్, సర్జికల్, కార్డియాక్ ఎమర్జెన్సీ, శ్వాస, గాయ సంబంధిత అత్యవసర పరిస్థితులు, ప్రసూతి అత్యవసర పరిస్థితులు, పిడియాట్రిక్ ఎమర్జెన్సీస్ తదితరాలు అత్యవసర వైద్య సేవల కిందకు రానున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల వైద్యులు, నర్సులతోపాటు మెడికల్ కాలేజీలో చదువుతున్న విద్యార్థులకు నెల్స్ ట్రెనింగ్ ఇవ్వనున్నారు. కార్డియాక్ అరెస్టయిన సమయంలో సీపీఆర్ ఎలా చేయాలి.. ఆటోమేటిడ్ ఎక్స్‌టర్నల్ డిఫిబ్రిలటర్(ఏఈడీ) మెషీన్లు ఎలా ఉపయోగించాలి.. పిడియాట్రిక్ ఎమర్జెన్సీ సమయంలో బ్యాగ్ మాస్క్ వెంటిలేషన్ టెక్నిక్, గర్భిణుల విషయంలో లెఫ్ట్ యుటరైన్ డిస్‌ప్లేస్‌మెంట్ సమయంలో ఎలా వ్యవహరించాలనే అంశాలను ప్రాక్టికల్‌గా చూపించనున్నారు. ఇలా ఎమర్జెన్సీ ట్రైనింగ్ సర్వీస్ విషయంలో టీమ్‌గా ఎలా విధులు నిర్వర్తించాలనే దానిపై కూడా అవగాహన కల్పించనున్నారు.

సీఎంఆర్ మిగులు పూర్తి చేయాలి

వరంగల్ కలెక్టర్ పి.ప్రావీణ్య



మిల్లర్లతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ రూరల్: వరంగల్ జిల్లాలోని రైస్‌మిల్లర్లు కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) మిగులు(బ్యాలెన్స్)ను ఈనెల చివరి వరకు పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్, పౌరసరఫరాల శాఖ, వ్యవసాయ శాఖ అధికారులతో ఖరీఫ్, రబీ 2021–22, 2022–23 సంవత్సరాలకు సంబంధించి ధాన్యం సేకరణ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ధాన్యం సేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులపై ఆరా తీశారు. సమీక్షలో అదనపు కలెక్టర్ శ్రీవత్స కోట, జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయాళ్, పౌరసరఫరాల శాఖ అధికారి గౌరీశంకర్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సంపత్‌కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పవిత్ర పండుగ రంజాన్

వరంగల్ అదనపు కలెక్టర్ శ్రీవత్స

వరంగల్ రూరల్: ముస్లింల పవిత్ర పండుగ రంజాన్ అని, పండుగకు ప్రభుత్వం అందించే గిఫ్ట్ ప్యాకెట్లను ప్రణాళికాబద్ధంగా పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేయాలని వరంగల్ అదనపు కలెక్టర్ శ్రీవత్స కోట అధికారులను ఆదేశించారు. రంజాన్ పండుగ సందర్భంగా బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవత్స మాట్లాడుతూ జిల్లాలో ఇఫ్తార్ విందులకు రూ.12లక్షలు కేటాయించగా.. 6వేల గిఫ్ట్ ప్యాకెట్లను మూడు నియోజకవర్గాల పరిధిలోని 12 మసీదుల్లో పంపిణీ చేయడానికి గుర్తించామన్నారు. సమావేశంలో జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి కె.విక్రమ్ కుమార్, బల్దియా అడిషనల్ కమిషనర్ అనిసుర్ రషీద్, ఏసీపీలు ఏసీపీ ఏ.సంపత్‌రావు, శ్రీనివాసరావు, డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, ముస్లిం మత పెద్దలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు



విద్యారణ్యపురి/కాశోజీ సెంటర్ : ఇంటర్ సెకండియర్ పరీక్షలు బుధవారం ముగిశాయి. హనుమకొండ జిల్లాలో చివరిరోజు పరీక్షలకు జనరల్, ఒకేషనల్ కోర్సులు కలిపి 15,238మందికి 14,801మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 437మంది గైర్హాజరయ్యారని డీఐఈఓ గోపాల్ తెలిపారు. వరంగల్ జిల్లాలో 6,522 మంది విద్యార్థులకు 6,225మంది హాజరుకాగా, 297మంది గైర్హాజరయ్యారని డీఐఈఓ కాక మాధవ రావు తెలిపారు. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ఇంటిబాట పట్టారు. తల్లిదండ్రులు తమ పిల్లలను దగ్గరుండి ఇంటికి తీసుకెళ్లారు.

కలుషిత నీరు తాగి కూలీలకు అస్వస్థత

వెంకటాపురం(కె): ములుగు జిల్లా వెంకటాపురం (కె) మండలం ఉప్పేడు గొల్ల గూడెం గ్రామంలో మిర్చి తోటలోకి కూలి పనులకు వెళ్లిన 25 మంది కూలీలు కలుషిత నీరు తాగి అస్వస్థతకు గురైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం... ఉప్పేడు గొల్లగూడెం గ్రామానికి చెందిన 25 మంది కూలీలు గ్రామ సమీపంలోని మిర్చి తోటలో కూలి పనులకు వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో కూలీలు భోజనం చేసిన అనంతరం డ్రిప్ పైప్ నుంచి వచ్చే నీటిని తాగారు. అయితే డ్రిప్ పైపులు శుభ్రం చేసేందుకు రైతులు ఓ ద్రావకాన్ని వదిలారు. ఆ విషయం తెలియని కూలీలు నీరు తాగడంతో వాంతులు చేసుకుని అస్వస్థతకు గురయ్యారు. గమనించిన గ్రామస్తులు ఆటో వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఏటూరునాగారం ఆస్పత్రికి తరలించారు.

పగిలిన అద్దాలు.. విరిగిన లాఠీ


ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, విద్యార్థులు


పోలీసులను అడ్డుకుంటున్న నిరసనకారులు

- కాకతీయ యూనివర్సిటీలో ఉద్రిక్తత
- మహాధర్నా ర్యాలీ, పేపర్ లీకేజీపై ఆగ్రహం
- సంఘర్షణ సభకు అనుమతి ఇవ్వకపోవడంతో పరిపాలనా భవనం లోకి చొచ్చుకెళ్లేయత్నం
- పోలీసుల లాఠీచార్జ్, విద్యార్థి నాయకుడి తలకు గాయం
- విద్యార్థి జేఏసీ నాయకుల అరెస్ట్, కేసు నమోదు


పూలకుండీ పగులగొడుతున్న విద్యార్థి

నేడు కేయూ బంద్‌కు పిలుపు

విద్యార్థి నాయకులపై పోలీసుల లాఠీచార్జ్ చేయడాన్ని నిరసిస్తూ నేడు (గురువారం) కేయూ బంద్‌కు పిలుపునిస్తున్నట్లు ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ తెలిపారు. విద్యార్థినాయకుల అరెస్టును నిరసిస్తూ కేయూలో నిరసన తెలిపారు.

కేయూ క్యాంపస్: పేపర్ లీకేజీలతో నిరుద్యోగుల జీవితాలతో కేసీఆర్ ప్రభుత్వం చెలగాటమాడుతుందని, వెంటనే టీఎస్‌పీఎస్సీ చైర్మన్, ఇతర సభ్యులను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం కేయూ విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో క్యాంపస్‌లోని లైబ్రరీ ఎదుట నిర్వహించిన మహాధర్నా ఉద్రిక్తతకు చోటు చేసుకుంది. నిరుద్యోగుల సమస్యలపై చర్చించేందుకు కేయూలో తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల సంఘర్షణ సభను నిర్వహిస్తామని కేయూ విద్యార్థి జాక్ అనుమతి కోరితే వీసీ ఆచార్య తాటికొండ రమేశ్ అనుమతి ఇవ్వలేదు. దీంతో ఆగ్రహించిన విద్యార్థి సంఘం నాయకులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఇదేమి రాజ్యం, ఇదేమి రాజ్యం, దొంగల రాజ్యం, దోపిడీ రాజ్యం అంటూ నినాదాలు చేస్తూ లైబ్రరీ నుంచి పరిపాలనా భవనంవైపు రాగా పోలీసులు భారీ బందోబస్తుతో పరిపాలన భవనం రెండు గేట్లను మూసివేయడంతో రెండో గేటు వైపు ర్యాలీ నిర్వహించారు. రెండో గేటు కూడా మూసివేయడంతో విద్యార్థి సంఘం నాయకులు, విద్యార్థులు మళ్లీ పరిపాలనా భవనం వద్దకు చేరుకుని ధర్నా చేశారు. సంఘర్షణ సభకు అనుమతి ఇవ్వాలని, వెంటనే వీసీ బయటకు రావాలని పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఆందోళన చేశారు. సంఘర్షణ సభకు వీసీ రమేశ్ అనుమతి ఇస్తే మేము శాంతియుతంగా వెళ్లి పోతామని విద్యార్థి జాక్ నాయకులు పోలీసులను కోరారు. అయినా వీసీ రాకపోవడంతో పరిపాలనా భవనంలోకి చొచ్చుకెళ్లే యత్నం చేశారు. అప్పటికే ప్రధాన ద్వారం వద్ద మోహరించి ఉన్న పోలీసులు వీరిని అడ్డుకోవడంతో పోలీసులకు విద్యార్థులకు మధ్య తోపులాట జరిగింది. ప్రధాన ద్వారం వద్ద పలు అద్దాలు పగిలిపోయాయి. దీంతో పోలీసులు విద్యార్థి నాయకులపై లాఠీచార్జ్ చేశారు. దీంతో విద్యార్థినాయకులు కొన్ని పూలకుండీలను పగులగొట్టారు. మరోవైపు ఇద్దరు విద్యార్థి నాయకులు పరిపాలన భవనం ఎక్కి తమ నిరసన తెలిపారు. అక్కడి నుంచి దూకుతారని భావించిన పోలీసులు వారిని కిందకు దించివేశారు. మరికొందరు ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసే యత్నం చేయగా పోలీసులు లాక్కునే యత్నం చేయడంతో విద్యార్థి నాయకులకు పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. ఈ తోపులాటలో విద్యార్థి నాయకుడు మేడ రంజిత్ తలకు గాయం అయింది. దీంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. విద్యార్థి నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి ధర్మసాగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

క్రిమినల్ కేసులు నమోదు చేయాలి: కేయూ విద్యార్థి జేఏసీ

రాష్ట్రంలోని 35 లక్షల నిరుద్యోగుల భవిష్యత్‌ను అంగట్లో పెట్టారని కేయూ విద్యార్థి జేఏసీ నాయకులు మండిపడ్డారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్, ఇతర సభ్యులను బర్తరఫ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కోచింగ్ సెంటర్లలో వేల రూపాయలు పెట్టి ప్రిపేర్ అయితే గ్రూప్ 1, తదితర పేపర్ల లీకేజీలతో వారి ఆశలు అడియాశలయ్యాయన్నారు. ఎమ్మెల్సీ కవిత లిక్కర్ కేసులో ఢిల్లీలో ఈడీ విచారణను ఎదుర్కొంటుంటే ప్రజలను, నిరుద్యోగులను గాలికి వదిలేసి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఢిల్లీ లో తిష్ట వేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కేయూ విద్యార్థి జేఏసీ చైర్మన్ ఇట్టబోయిన తిరుపతియాదవ్, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి విజయ్‌ఖన్నా, కోశాధికారి మొగిలి వెంకటరెడ్డి, గిరిజన శక్తి స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోతు రాజునాయక్, టీజీవీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడ రంజిత్, ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేష్, ఎన్ఎస్‌యూఐ బాధ్యులు అలువాల కార్తీక్, రాకేష్, కృష్ణ, బీఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్ బొట్ల మనోహర్, కళ్లేపెల్లి ప్రశాంత్, కామగోని శ్రవణ్, వంశీకృష్ణ, బి నర్సింహారావు, బీసీ విద్యార్థి సంఘం కేయూ ఇన్‌చార్జ్ ఆరెగంటి నాగరాజు, జేఏసీ నాయకులు రంజిత్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

13మందిపై కేసు

వీసీ ఆచార్య రమేశ్ ఫిర్యాదు మేరకు 13 మంది విద్యార్థి సంఘం నాయకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా హనుమకొండ జిల్లా బీజేపీ అధ్యక్షురాలు రావు పద్మ విద్యార్థి నాయకులను పరామర్శించారు.

ప్రభుత్వానికి తొత్తుగా వ్యవహరిస్తున్న వీసీ రమేశ్



సంఘర్షణ సభకు అనుమతి ఇవ్వకుండా వీసీ ఆచార్య రమేశ్ ప్రభుత్వానికి తొత్తుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైన 30 లక్షల మంది నిరుద్యోగుల నియామకాలపై నమ్మకం కలగాలంటే టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యులను బర్తరఫ్ చేయాలి. పేపర్ లీకేజీని సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలి.

-తిరుపతి యాదవ్, కేయూ విద్యార్థి జాక్ చైర్మన్

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం..



ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతుంది. పేపర్ లీకేజీపై టీఎస్‌పీఎస్సీ చైర్మన్, కేసీఆర్ ప్రభుత్వం బాధ్యత వహించాలి. సంఘర్షణ సభకు వీసీ అనుమతి ఇవ్వకపోవడం శోచనీయం.

-మేడ రంజిత్, టీజీవీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

వసంతోత్సవానికి వేళాయె



కళాధ్వనిని ఆవిష్కరిస్తున్న నిట్ డైరెక్టర్ రమణారావు

- దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద కల్చరల్ ఫెస్ట్
- నిట్‌లో ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో స్ప్రింగ్‌స్ప్రీ-23
- ప్రారంభోత్సవంలో పాల్గొననున్న పవన్‌కల్యాణ్

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో ప్రతి ఏడాది విద్యార్థులచే నిర్వాహకులుగా మూడు రోజుల వసంతోత్సవ సంబురం, సంస్కృతి సంప్రదాయాలను పంచుకునే వేదికగా నిలుస్తున్న స్ప్రింగ్ స్ప్రీ-23 ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్నారు. నిత్యం విద్యతో కుస్తీ పడుతూ ప్రపంచస్థాయిలో తమ ప్రతిభను చాటుకుంటున్న నిట్ విద్యార్థులు తోటి విద్యార్థులతో పాటు దేశవ్యాప్త ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులతో ఆ ప్రాంత సంస్కృతి సంప్రదాయాలను, మన సంస్కృతి సంప్రదాయాలను పరస్పరం పంచుకుంటూ యాన్యువల్ స్పోర్ట్స్ మీట్‌గా ఏర్పాటు చేసుకుని మూడు రోజుల వేడుకకు శ్రీకారం చుట్టారు. దేశ వ్యాప్తంగా వివిధ కళాశాలల నుంచి 20వేల మంది విద్యార్థులు ఈ ఏడాది స్ప్రింగ్‌స్ప్రీ వేడుకల్లో పాల్గొననున్నారు. ఇది దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద కల్చరల్ ఫెస్ట్‌గా నిట్ వరంగల్ స్ప్రింగ్‌స్ప్రీ నిలుస్తుంది.

ప్రతి ఏడాది ప్రత్యేక థీంతో..

నిట్ వరంగల్ ప్రతి ఏడాది నిర్వహిస్తున్న స్ప్రింగ్‌స్ప్రీ వసంతోత్సవ వేడుకలకు ప్రత్యేక థీంను రూపొందిస్తారు. ఈ ఏడాది స్ప్రింగ్‌స్ప్రీ-23కి కళాధ్వనిగా నామకరణం చేశారు. 2019లో కళాక్షేత్ర, 2020లో మితియాస్, 2022లో సృష్టి, 2023లో కళాధ్వనిగా నామకరణం చేశారు.

55కు పైగా ఈవెంట్స్..

ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించే స్ప్రింగ్‌స్ప్రీ-23 కళాధ్వనీలో 55కు పైగా ఈవెంట్స్‌తో అలరించనుంది. తొలిరోజు 7న టాలీవుడ్ నైట్ పేరిట టాలీవుడ్ సింగర్స్ నిట్ మైదానంలో అలరించనున్నారు. రెండో రోజు 8న డీజే నైట్, సన్‌బర్న్ పేరిట డీజేలు వివిధ రకాల పాటలతో అలరించనున్నారు, మూడో రోజు 9న బాలీవుడ్ నైట్ పేరిట బాలీవుడ్ సింగర్స్ ఉర్రూతలూగించనున్నారు. వీటితో పాటు మూడురోజుల పాటు ప్రొ షోలు, స్పాట్ లైట్స్, స్యాండ్ ఆర్ట్, సైలెంట్ డీజేస్, మాస్టర్ చెఫ్, జుంబాడ్యాన్స్, కొరియో నైట్, వార్ ఆఫ్ డీజేస్, ఐడల్, అల్యూర్‌లతో వసంతోత్సవం కలర్ ఫుల్‌గా సాగనుంది.

ప్రారంభోత్సవానికి పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్



నిట్ వరంగల్ స్ప్రింగ్ స్ప్రీ-23 కళాధ్వనీ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా సినీ హీరో పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ఏప్రిల్ 6న ముఖ్యఅతిథిగా పాల్గొని స్ప్రింగ్‌స్ప్రీ-23 వేడుకలను నిట్ మైదానంలో ప్రారంభించనున్నారు. పవన్ కల్యాణ్‌ను చూసేందుకు నిట్ వరంగల్ విద్యార్థులతో పాటు ఓరుగల్లు వాసులు ఎదురు చూస్తున్నారు. నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఎంట్రీ పాసుల కోసం ఇప్పటికే క్రేజ్ మొదలైంది. స్ప్రింగ్‌స్ప్రీ-23 వేడుకల్లో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్లను నిట్ ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్ట్రాగామ్‌లో క్యూఆర్‌కోడ్‌లతో అందజేస్తున్నారు.

ప్రతిష్టాత్మకంగా స్ప్రింగ్‌స్ప్రీ-23 కళాధ్వని

నిట్ వరంగల్‌లో నిర్వహించనున్న మూడు రోజుల స్ప్రింగ్‌స్ప్రీ-23 కళాధ్వనిని ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో వేడుకలను ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్నామని నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు తెలిపారు. బుధవారం నిట్‌లోని సుభాష్‌చంద్రబోస్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను అలవర్చేందుకు, సంస్కృతి సంప్రదాయాలను పరస్పరం పంచుకునేందుకు స్ప్రింగ్‌స్ప్రీ వేడుకలు విద్యార్థులే నిర్వాహకులుగా నిర్వహిస్తున్నారు. రెండు నెలల పాటు 200 మంది విద్యార్థులు నిట్‌లోని వివిధ క్లబ్స్‌తో మమేకమై కోర్‌టీంలుగా ఏర్పడి ఈ వేడుకలను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ పులి రవికుమార్, ఫ్యాకల్టీ అడ్వైజర్ హీరాలాల్, కోర్ టీం వంశీకిషోర్, అజయ్‌కుమార్, పీయూష్‌కుమార్, సాయిగురునాథ్ పాల్గొన్నారు.